


# మరో అడుగు

## - డా.వేదుల సుభద్ర



(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

పెద్దగా పెట్టిన అతని కేక ఆ చిన్న ఇంటిలో ప్రతిధ్వనించింది.

పిల్లలచూపునించి తప్పించుకోవడానికి ముఖం కడుక్కుంటానని వెళ్ళిన రాధికే మొదట విని గాభరాగా పరిగెత్తుకుని వచ్చింది వంటగదిలోకి.

" కిరణ్, ఏమయింది? ఎందుకలా అరిచారు? ఎంత భయపడ్డానో మీకేమైనా అయిందో , ఏమో అని.

చెయ్యి కాలిందా?" అంటూ ప్రశ్నలు వేసింది.

అరచేతిలో ముఖాన్ని దాచుకుని ఏ భావమూ లేకుండా నిలబడి ఉన్న భర్తని చూసి రాధిక చాలా కంగారు పడింది. గాస్ పొయ్యినిండానూ, గట్టు మీదా ధారలుగా పారుతున్న టీ.

గభాల్న గాస్ పొయ్యి కట్టేసింది.

“టీ నేను పెడతాను, మీరు జరగండి” అంటూ అతన్ని పక్కకు జరిపి తడిగుడ్డతో గట్టూ, పొయ్యి శుభ్రంగా తుడిచి ఆపైన మళ్ళీ గిన్నెలో నీళ్ళు పోసి స్టవ్ మీద పెడుతున్నది కాస్తా వెక్కిళ్ళు వినబడటంతో కిరణ్ వైపు చూసింది.

ఆపుకోలేని దు:ఖంతో వెక్కుతున్నాడు కిరణ్.

" కిరణ్ ప్లీజ్, మీరే ఇలా అయిపోతే మా అందరి మాటేమిటి? ప్లీజ్ దయచేసి సంభాళించుకోండి. నాకోసం, మన పిల్లల కోసం" గొణుగుతున్నట్టుగా అంది.

ఆమె భుజం మీద తల వాల్చి పసిపిల్లాడిలా ఏడవసాగాడు కిరణ్.

అతని చెంపమీద చెయ్యి వేసి అతన్ని తనవైపుకు తిప్పుకుని గట్టిగా హత్తుకుని.

"ప్లీజ్, ఊరుకోండి. మిమ్మల్నిలా చూస్తూ నన్ను నేను కంట్రోల్ చేసుకోగలనా? ఇద్దరం ఇలా ఏడుస్తూ కూర్చుంటే పిల్లలు తట్టుకోగలరా? చెప్పండి. నా మాట వినండి " అనునయంగా అంది.

అప్పటి వరకూ జరుగుతున్నది అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తూ, విన్నదాన్ని తట్టుకోవడానికి ధైర్యం ప్రదర్శిస్తూ ఉన్న కిరణ్ ఒక్కసారి ఆ పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలో తెలియకపోయేసరికి కదిలిపోయాడు.

గూడు కట్టుకున్న ఆవేదన గుండెని బద్దలు కొట్టుకుని బయటకు వచ్చిన క్షణం అది.

మరో రెండునిమిషాలకి కొద్దిగా తేరుకుని జేబురుమాలుతో కళ్ళ నీళ్ళు తుడుచుకుని రాధికని వదిలి పక్కకు జరిగాడు.

" టీ చేసేలోపల ముఖం కడుక్కోండి" అంది నెమ్మదిగా.

అతను వెళ్ళాకా పిల్లలకి పాలు, తమిద్దరికీ టీలు చేసి ప్లేట్ లో కొద్దిగా చేగోడీలు, బిస్కట్లు పట్టుకుని వచ్చింది. పాలు తాగాకా, పిల్లల్నిద్దరినీ ఆడుకోమని బయటకు పంపింది.

పక్కన టీ కప్పులతో ఇద్దరూ ఎదురెదురుగా మౌనంగా కూర్చున్నారు.

ఎప్పుడూ ఎరగని, అనుకోని పరిస్థితి.

'కష్టాలు మనుషులకి కాక మానులకొస్తాయా?' లాంటి మాటలు చెప్పుకోవడం చాలా తేలిక. వస్తే కానీ తెలీదు ఎలా ఉంటుందో! అనుకుంది రాధిక.

తర్వాత ఏం జరగాలో ఇద్దరికీ తెలుసు.

స్వప్నికి జరగబోయే ట్రీట్మెంట్ గురించి నిర్ణయం తీసుకోవాలి. దాని గురించి డా.సుజిత్ చెప్పిన ప్రతీ మాటా వాళ్ళకి గుర్తుంది.

ఇప్పుడే చెప్పినట్టు చెవుల్లో మళ్ళీ మళ్ళీ వినబడుతూనే ఉంది.

ఆయన చెప్పిన ట్రీట్మెంట్ పద్ధతులేవీ తమకి అందుబాటులో లేవని వాళ్ళిద్దరికీ ఆయన చెప్పినప్పుడే అర్థం అయింది.

"ఇదంతా ఒక కల, పీడకల అయిపోతే ఎంత బావుండును. అసలేదీ జరగలేదు, స్వప్నిక కి ఏమీ లేదు అని ఎవరైనా వచ్చి వరమిచ్చినట్టు ఎవరైనా వచ్చి చెప్పకూడదా?" అంది రాధిక కళ్ళనీళ్ళను తుడుచుకుంటూ.

శుష్కంగా నవ్వాడు.

" జరిగినది తెలిశాకా, జరగలేదని, జరగకపోతే బావుండును అనుకుని ఏం ప్రయోజనం రాధీ? మనముందున్న సమస్య మనకు తెలుసు. మనల్ని మభ్యపెట్టుకుని మనం సాధించేది ఏముంది చెప్పు? సమస్యని ఎదుర్కొవడమే మనం చెయ్యవలసినది. అంతే కదా" అన్నాడు బాధగా.

" ఎందుకు, మనమ్మాయికే ఎందుకిలా అయ్యింది?" అంది రాధిక.

" మళ్ళీ అలాంటి ప్రశ్నలు  వేసుకోవడమూ అనవసరమే. మన అమ్మాయికే కాదు, ఎవరికీ ఎదురు రాకూడని పరిస్థితి కదా, మరెవరికైనా రావచ్చు కదా అని కూడా అనుకోలేము కదా" అన్నాడు నెమ్మదిగా.

మౌనంగా తల ఊపింది. 'ఎవరికీ రాకూడదు, అందరూ ఉన్నన్నాళ్ళూ సుఖంగా సంతోషంగా ఉండాలి' అనుకుంది మనసులో.

"డాక్టర్లిద్దరూ చెప్పినది నీకు గుర్తుంది కదా, స్వప్ని కి తప్పక తగ్గిపోతుంది అని వాళ్ళిద్దరూ ఎంత గట్టిగా చెప్పారో కదా. అది తల్చుకుంటేనే కొద్దిగానైనా హాయిగా అనిపిస్తోంది కదా.

కానీ ఎదురుగా ఉన్న దారి సులభమైనది కాదు రాధీ. కఠినమైన దారిలో కష్టమైనా సరే కడదాకా వెళ్ళి మన బంగారాన్ని భద్రంగా వెనక్కి తెచ్చుకోవాలి. అంతే మనం ఆలోచించవలసినది. అది స్వప్నికీ తేలిక కాదు, మనకీ కాదు."

ఇతర దేశాలతో పోలిస్తే మన దేశంలో ఈ పరీక్షలు, చికిత్సా విధానాలు చవకే అన్నారు కదా వాళ్ళిద్దరూ. అయినా లక్షల్లో మాటే కానీ తక్కువ కాదు.

ఎంతకాదన్నా అధమ పక్షం 5-6 లక్షలైనా కావాలి, ఆపైన అదనంగా ఏం వస్తాయో తెలీదు.

ఇదిగో డాక్టర్లు చెప్పిన వివరాలన్నీ నా పుస్తకం లో రాసుకున్నాను చూడు అంటూ తన పాకెట్ డైరీ ని తీసి ఆమె ముందుంచాడు అతను.

వాటిల్లో ఒక్కటి కూడా మర్చిపోకుండా తన మనసులో నిక్షిప్తం చేసుకున్న రాధిక బాధగా తల ఊపింది.

1. నిపుణుల కన్సల్టింగ్ చార్జీలు: వెళ్ళిన ప్రతీ సారీ కనీసం వెయ్యికి తగ్గకుండా తీసుకుంటారు ప్రైవేట్ హాస్పటళ్ళలో. చాలా మంది ఇంకా ఎక్కువే. ఎక్కడైనా ఉచితంగా చూసినా, వాటి క్వాలిటీ, వారు కేటాయించే సమయం, ఇలాంటివాటి గురించి ఏమీ చెప్పలేమన్నారు డా. సుజిత్.

2. కీమోథెరపీ ఖరీదు: ఒక్కొక్క సెషన్ కి ఇంత అని చార్జ్ చేస్తారుట. 30000–40000 ఉండచ్చు అన్నీ కలిపి అన్నారు. ఎన్ని సార్లు అవసరం పడుతుందో, దాన్ని బట్టి ఎంతవుతుందో తెలియాలి.

3. రేడియోథెరపీ: ఇదీ అంతే, మనకి అవసరం పడినన్ని సార్లని బట్టి ఉంటుంది. లక్షల్లోనే ఉంటుందన్నారు, ప్రతీ రేడియేధన్ సైకిల్ కనీసం 150000 వరకూ ఉండచ్చును అని

4. మందులు: కీమో మందులు కాక, మరెన్నో మందులు అవసరం పడతాయి. వాటి ఖరీదు కూడా ఎక్కువే ఉంటుంది.

5. ఆపరేషన్: ఆపరేషన్ ఖరీదులు మనకి తెలిసినవే కదా. రెండు నుంచి ఎన్ని లక్షలైనా అవచ్చు, అప్పుడప్పుడు పదిదాకా కూడా అవచ్చు. కానీ స్వప్ని కి ఉన్న కండిషన్ ని ఆపరేషన్ తో నయం చెయ్యలేరు, లుకేమియా రక్తం ద్వారా వ్యాప్తి చెందుతుంది కనక ఆపరేషన్ వల్ల ఏమీ ఉపయోగం ఉండదు. కనక ఆపరేషన్ అవసరం ఉండదు

6. మనం రక రకాల హాస్పటల్స్ కి, డాక్టర్ల దగ్గరకీ వెళ్ళి రావడానికి అయ్యే ఖర్చులు

7. హాస్పటల్ లో ఉండవలసి వస్తే రూములు, ఇతర చార్జీలు

8. నర్సులకి, జెనెటిక్ కౌన్సిలర్లు ఇలాంటివాళ్ళకి ఇవ్వవలసిన ఫీజులు

9. పాపకి కావలసిన ప్రత్యేకమైన ఆహారం లాంటివి

ఇలా అన్నీ రాసుకున్నాను అంటూ భర్త చూపించిన లిస్ట్ కేసి భయంతోనూ, నిస్సహాయతతోనూ చూసింది రాధిక.

తన మనసులో అన్నీ తిరుగాడుతూ ఉన్నా వాటన్నింటినీ ఒక చోట చూసేసరికి ఆమెకి తట్టుకోలేనంత గాభరా వచ్చింది. అది డబ్బు గురించిన దిగులు కాదు, అది అసలు ఆమె మనసులోనే లేదు.

'నోరు తిరగని, తరచుగా వినని ఇలాంటి చికిత్సలన్నీ వినడానికే తనకింత భయంగా ఉంటే అ తన చిన్న తల్లి ఎలా తట్టుకోగలదు? విరిసీ విరియని పువ్వులాంటి పిల్ల ఎలా భరించగలదు? ' అని అనుకోగానే ఆమె తల్లి మనసు అంతులేని వేదనకి గురి అయింది.

" ఎందుకు ఇంత విషమ పరీక్ష తమకి? ఏం తప్పు చేసింది ఆ చిన్నపిల్ల? ఎప్పుడూ పొరపాటుగానైనా తప్పు చెయ్యదు, ఎవరికీ హాని తలపెట్టదు. దానికెందుకు ఇంత శిక్ష?" ఇలాంటి ఆలోచనలు రాగానే మళ్ళీ ఆమెకి ఆపుకోలేని దు:ఖం వచ్చింది మళ్ళీ.

ఏదో తెలియని ఆవేశంతో భర్త చేతిలోంచి పుస్తకం లాక్కుని నేలమీద కి విసిరి కొట్టింది.

" చీమకైనా హాని చెయ్యని కుటుంబం మనది, మన మే మిటో, మన చిన్ని ఆనందాలేమిటో, మన లోకమేమిటో మనదే అన్నట్టుగా బ్రతికేవాళ్ళం మనం.

దేవుడిమీదే కాదు, తల్లితండ్రులమీద కూడా అలవి కాని భయ భక్తులతో ఉంటామే. ఏం తప్పు చేశామని మనకిలా జరిగింది? ఎందుకు?" అంటూ

" దేవుడికి దయలేదు,అసలు ఆయనే లేడు. ఉంటే ఇలా జరగనే జరగదు. జరిగిందంటే దేవుడే లేడనే అర్థం" అంటూ ఏదేదో మాట్లాడసాగింది

ఏమీ మాట్లాడకుండా ఆమెనే చూస్తూ ఉండి పోయాడు కిరణ్, ఆమెని మాట్లాడనిస్తూ.

ఎక్కడో ఘనీభవించిన బాధని దాచుకుని భారం పెంచుకోవడం కన్నా ఇలా బయట పడి తేలిక పడటం మంచిది అనుకున్నాడు

గంట క్రితం తనకి జరిగినదీ ఇదే.

అలవికాని అసహాయత లోంచి వచ్చే ఆక్రోశం.

ఇప్పుడు కాస్త తేలిక పడి ఆలోచించగలుగుతున్నాడు తను, అలాగే ఆమెకి కూడా అవుతుంది. తను ఆ స్థితిలోకి వచ్చాకా ఇద్దరూ కలిసి ఏం చెయ్యాలో చూడగలం అనుకున్నాడు

అలా అనుకోగానే ఆమె భుజాల చుట్టూ చెయ్యి వేసి దగ్గరకు తీసుకున్నాడు. మౌనంగా ఓదార్పుగా ఆమె భుజాన్ని తడుతూ, చెంపలమీద కన్నీళ్ళు తుడుస్తూ ఉండిపోయాడు.

మరో రెండు మూడు నిమిషాల సేపు ఏవేవో మాట్లాడింది రాధిక.

ఇక తేరుకుంటుంది అనుకుంటూ ఉండగానే అధాట్టుగా స్పృహ తప్పింది ఆమెకి.

ఆమె చేతిలో గట్టిగా బిగిసిన అతని షర్ట్ కొస. సోలి పోయి, వాలిపోయినట్టుగా తోటకూర కాడలా వేళ్ళాడిపోయిన ఆమె.

" రాధీ, రాధీ" బుగ్గలు నిమురుతూ పిలిచాడు.

తర్వాత ఆమె పట్టు విదిలించుకుని గ్లాస్ తో నీళ్ళు తెచ్చి నెమ్మదిగా ఆమె ముఖాన చిలకరించాడు.

నెమ్మదిగా కళ్ళు విప్పు అతన్ని చూసింది రాధిక.

" సారీ" అంది కళ్ళు దించుకుని

" పర్వాలేదు రాధీ. మనసులోని బాధ బయటకు వచ్చేయడమే మంచిది. మనం స్థిమితంగా ఏం చెయ్యాలి అన్నది చర్చించుకోవచ్చు."

" నాకెందుకు? మాకే ఇలా ఎందుకు జరగాలి?" లాంటి ప్రశ్నలు కాదు మనం వేసుకోవలసినది. చెప్పుకోవలసినవి సమాధానాలు, చూసుకోవలసినవి పరిష్కారాలు.

కదా? అన్నాడు భార్య ముఖం లోకి చూస్తూ.

కాదన్నట్టు తల అడ్డంగా ఊపింది రాధిక.

చిన్నపిల్లలా కనబడుతున్న ఆమెని ప్రేమగా దగ్గరకు తీసుకున్నాడు.

సరే, ప్రశ్నలే అడగాలి అంటే, సమాధానం లేనివే అయినా మనం అడగాల్సిన ప్రశ్నలు.

" అసలీ రోగాలు ఎందుకున్నాయి? ఇలాంటి విపత్కర పరిస్థితులు రాకుండా ఉండాలంటే మనందరం ఏం చెయ్యాలి? వచ్చినా దాన్ని ధైర్యం ఎదుర్కోవడానికి ఏం చెయ్యాలి? ఇలాంటివి కదూ" అన్నాడు

జీవితం కూడ వైకుంఠపాళి లాంటిదే. ఎప్పుడూ నిచ్చెన ఎక్కుతామో, ఎప్పుడు పాము నోట్లో పడతామో తెల్లియదు. మన చేతిలో పందెం వేసే పాచిక మీదే ఉంటుంది. దాంట్లో రెండు పడడానికెంత అవకాశముందో, నాలుగు పడడానికి అంతే. ఎవరికి ఏది పడుతుందో తెలియని గవ్వలాటే జీవితం.

పెద్దపాము దగ్గరకొచ్చి నిల్చుంది మన బుజ్జి తల్లి. దాని నోట్లోకి పోనీయకుండా మనిద్దరం మన సర్వశక్తులూ ఒడ్డి మరీ కాపాడుకోవాలి. అంతే, ఇదే మన లక్ష్యం. మిగతావన్నీ అప్రస్తుతం. అవునా, కాదా? అన్నాడు.

మౌనంగా తల ఊపింది రాధిక.

ఈ పరుగు వచ్చే నెలదాకా

Post your comments